గాయపడిన ఒంటరి ఏనుగు మృతి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

చిత్తూరు పశ్చిమ రేంజ్ పారదరామి రిజర్వ్ ఫారెస్ట్ పరిధి గుడ్డివాని చెరువులో గాయాలతో ఎస్వీ జూ పార్కులో వెటర్నరీ డాక్టర్ల పర్యవేక్షణలో వైద్య సేవలు పొందుతున్న వయోజన మక్నా ఏనుగు బుధవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు జూ క్యూరేటర్ సెల్వం తెలిపారు. గుడ్డివాని చెరువులో కదల్లేక తీవ్రంగా గాయపడిన స్థితిలో ఈ 25 ఏళ్ల ఏనుగును అటవీ, ఎస్వీ జూ పార్కు బృందాలు రెస్క్యూ చేసి ఒకటవ తేదీన ఎస్వీ జూ పార్కుకు తరలించారన్నారు. గాయాలు మానడానికి వెటర్నరీ డాక్టర్లు చేసిన వైద్యసేవల ప్రయత్నాలకు ఏనుగు శరీరం సహకరించక పోవడం, ఏనుగుల గుంపులో జరిగిన కొట్లాటలో తీవ్రంగా గాయపడడం, రక్తం విషపూరితంగా మారిపోవడంతో ఏనుగు మృతి చెందినట్లు చెప్పారు. ఏనుగు కళేబరాన్ని ఎస్వీ జూ పార్కు ఆవరణలో చిత్తూరు అటవీ శాఖ అధికారులు, ఎస్వి జూ పార్కు క్యురేటర్, పశు వైద్య బృందాల సమక్షంలో ఖననం చేశామన్నారు.

దిత్వా ముప్పు

దిత్వా ముసురు జిల్లాను వణికిస్తోంది.. ఐదు రోజులుగా వర్షం ఆగకుండా కురుస్తూనే ఉంది.. ఇప్పటికే జిల్లాలోని చెరువులు, రిజర్వాయర్లు నిండుకుండలను తలపిస్తున్నాయి.. బలహీనంగా ఉన్న చెరువు కట్టల ఆయకట్టు రైతుల గుండెలు గుబేల్‌మంటున్నాయి. ఏ నిమిషంలో ఏ చెరువు కట్ట బలహీనపడి తెగిపోతుందోనని ఆందోళన చెందుతున్నారు. చాలాచోట్ల రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. గుంతలమయమయ్యాయి. కొన్నిచోట్ల గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయి. వరినార్లు నీట మునిగి కుళ్లిపోయే ప్రమాదంలో ఉన్నాయి.

చిట్టమూరులో కొట్టుకుపోయిన రోడ్డు

చాలాచోట్ల గ్రామాలకు రాకపోకలు బంద్

ప్రజాశక్తి - చిట్టమూరు, యంత్రాంగం

చిట్టమూరులో వరద తాకిడికి మొలకలపూడి నుంచి నాయుడుపేటకు వెళ్లే ఆర్ అండ్ బి రోడ్డు బుధవారం తెల్లవారుజామున కోతకు గురయ్యింది. దీంతో మొలకలపూడి గ్రామానికి రాకపోకలు స్తంభించాయి. తహశీల్దార్ నరేష్ బుధవారం స్టేషన్ హౌస్ ఆఫీసర్ చిన్న బలరామయ్య, ఎంపిడిఒ ఉమామహేశ్వరరావు, ఆర్ అండ్ బి అధికారులతో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆర్ అండ్ బి ఈఈ రామాంజనేయులు, ఎఇ చెన్నరాయుడు ఆధ్వర్యంలో తూములు ఏర్పాటు చేసి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారు. డిప్యూటీ తహశీల్దార్ నిరంజన్‌కుమార్, ఆర్ఐ సుధ పాల్గొన్నారు. చిట్టమూరు మండలంలో మంగళవారం 262.2మిల్లీల వర్షపాతం నమోదయ్యింది. మల్లంకొత్తగుంట మధ్య ఉన్న తాగేటమ్మ గుడి దగ్గర రొయ్యలవాగు పొంగి నీరు రోడ్డు మీద ఉధృతంగా ప్రవహించడంతో నాయుడుపేట నుంచి మల్లంకు, మల్లం చుట్టుపక్కల గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. నాయుడుపేట నుంచి మల్లంకు, మల్లం చుట్టుపక్కల గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. సూళ్లూరుపేట నుంచి కోటకు వెళ్లే మార్గంలో తాడిమేడు, వాకాడు వద్ద ఉన్న కలుజులు పొంగి పొర్లడంతో చిట్టమూరు, వాకాడు మధ్య, సూళ్లూరుపేట–కోట మధ్య రాకపోకలు స్తంభించాయి. గుణపాడు ఎస్టీ కాలనీకి చెందిన 12 కుటుంబాల ఇళ్లల్లోకి నీరు రావడంతో బీసీ హాస్టల్, గుణపాడులో పునరావాసం ఏర్పాటు చేసి ఆహారం, తాగునీరు, వైద్యసదుపాయాలు కల్పించారు.

– బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో ఎస్ఐ హరిప్రసాద్ రెవెన్యూ, సచివాలయ అధికారులతో కలిసి పొంగి పొర్లుతున్న ప్రాంతాలను, రోడ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బుధవారం కాళంగి రిజర్వాయర్‌కు వరద పోటెత్తడంతో అధికారులు నాలుగు గేట్లు ఎత్తేసి నీటిని దిగువకు వదిలారు. కాల్వ పరీవాహక లోతట్టు ప్రాంత ప్రజలను హెచ్చరించారు. కాలమనంబేడు గ్రామానికి వెళ్లే మార్గమధ్యంలో అరుంధతి కాలనీ దగ్గర రహదారి చెరువును తలపిస్తోంది. ఉదయం లేస్తే కంపెనీలకు పోయేవారంతా ఈ రోడ్డు మార్గంలోనే ఉపాధి కోసం పోవాల్సి ఉంది. ఏకలవ్య గురుకుల పాఠశాల విద్యార్థులు, కూరగాయలు తీసుకెళ్లే ఆటోలవాళ్లు ఇబ్బందులకు గురవుతున్నారు.

చేనేత కార్మికులను ఆదుకుంటాం : మట్టం శ్రావణిరెడ్డి

గూడూరు టౌన్ : దిత్వా తుపాను కారణంగా నష్టపోయిన చేనేత కార్మికులను ఆదుకునేందుకు చర్యలు చేపడతామని వీవర్స్ డెవలప్‌మెంట్ అధికారి విజయనంద్, తిరుపతి పార్లమెంట్ తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణిరెడ్డి పేర్కొన్నారు. నేతన్నల ఇంటింటికి వెళ్లి మగ్గం గుంతలను పరిశీలించారు. మగ్గం గుంతల్లో నీరు చేరి చేనేతలు జీవనోపాధి కోల్పోయారన్నారు. దాదాపు 250 మంది చేనేత రంగంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారు. వీరివెంట చేనేత మాజీ సొసైటీ అధ్యక్షులు కటికాల శ్రీనివాసులు, రాజనాల, రాయవరపు శ్రీనివాసు పాల్గొన్నారు.

గోడకూలి వద్ధురాలు మృతి

ప్రజాశక్తి -శ్రీకాళహస్తి రూరల్ (తొట్టంబేడు)

మండలంలోని కాసరం పంచాయతీలో బుధవారం సాయంత్రం పూరి గుడిసె గోడ కూలి రేణుకమ్మ (59) మృతి చెందిన సంఘటన చోటుచేసుకుందని మండల తాసిల్దార్ భారతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రేణుకమ్మ కొడుకు కోడలితో పక్కనే ఉన్న మిద్దె ఇంట్లో ఉండేదని బుధవారం మధ్యాహ్న సమయంలో అత్త కోడళ్ళకు చిన్నపాటి గొడవపడ్డారని చుట్టుప్రక్కల కుటుంబాల వారు తెలిపారన్నారు. మనస్థాపం చెందిన రేణుకమ్మ పక్కనే ఉన్న పూరిగుడిసెలో ఉండగా అప్పటికే వర్షానికి బాగా తడిసి ఉన్న గోడలు ఆమెపైన పడడంతో ఆమె మరణించారని తెలిపారు.

గిరిజన కాలనీలను పట్టించుకోవాలి

నాయుడుపేట : మున్సిపాలిటీ పరిధిలోని మహాలక్ష్మినగర్, దేశమ్మగుంట గిరిజన కాలనీల్లో నాలుగైదు రోజులుగా ఎడతెరపి లేకుండా బీభత్సంగా కురుస్తున్న వర్షానికి ఇళ్లల్లోకి నీరు చేరింది. వీరిని ఆదుకోవాలని సిపిఎం నాయకులు ఎస్‌కె అబ్దుల్లా, శివకవి ముకుంద డిమాండ్ చేశారు. ఆయా కాలనీల్లో బుధవారం పర్యటించారు. గుడిసెలు పడిపోయినా అధికారులు ఎవరూ పట్టించుకోలేదని గిరిజనులు వాపోయారు. దీంతో తహశీల్దార్ ఎం.రాజేంద్రకు ఫోన్ చేసి గిరిజనుల బాధలను వివరించారు. విఆర్‌ఒను పంపించి ఆదుకుంటామని తహశీల్దార్ హామీ ఇచ్చారు.

– దొరవారిసత్రంలో ఉధృతంగా ప్రవహిస్తున్న చెరువులను తహశీల్దార్ శైలకుమారి పరిశీలించారు. పూలతోట వద్ద కన్నకలవ, తనయాలి వద్ద కాళంగి నది, వెదురుపట్టు వద్ద పాలకలవలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. నీటి ప్రవాహం ఎక్కువైతే రాకపోకలు నిలిపేయాలని రెవెన్యూ సిబ్బందికి ఆదేశించారు. వేణుంబాక చెరువులోకి నీరు ఎక్కువగా వస్తుండడంతో చెరువు తెగే పరిస్థితి ఉందన్నారు. వీరివెంట ఎంపిడిఒ గోవర్దన్, ఎస్ఐ అజయ్‌కుమార్, ఇరిగేషన్ ఎఇలు చంద్రశేఖర్, హరికృష్ణ పాల్గొన్నారు.

కుళ్లిపోతున్న వరినాట్లు

వాకాడు : భారీ వర్షాలకు మండలంలోని వరినాట్లు పూర్తిగా మునిగిపోయి కుళ్లిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. రొయ్యల కాల్వ పొంగడంతో రోడ్డు తెగిపోయి ముట్టెంబాక, తిరుమూరు, వాయలపాలెం, దుగ్గారం వరి నాటిన పొలాలు పూర్తిగా మునిగిపోయాయి. బాల్రెడ్డిపాలెం–గంగన్న పాలెం మధ్య స్వర్ణముఖి వంతెన నిండి పొర్లడంతో 16 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వాకాడు బస్టాండ్ చుట్టూ నీరు చేరడంతో బస్సులు బస్టాండ్ కు వచ్చే పరిస్థితి లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వేల క్యూసెక్కుల నీళ్లు స్వర్ణముఖి బ్యారేజ్ నుండి దిగువ ప్రాంతాలకు వెళుతున్న కారణంగా కట్టలు దెబ్బ తినకుండా మండల తహసిల్దార్ సయ్యద్ ఇక్బాల్, ఎంపీడీవో సాయిప్రసాద్ లు ఎప్పటికప్పుడు పరిస్థితులు పర్యవేక్షిస్తూ జాగ్రత్తలు చేపడుతున్నారు. తుఫాను నేపథ్యంలో భారీ నష్టం ఏర్పడిందని ప్రభుత్వం ప్రజలకు తక్షణ సహాయం అందించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

అండర్ బ్రిడ్జిల వద్ద నీరు ఆగకుండా చర్యలు

తిరుపతి టౌన్ : దిత్వా తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాల వల్ల అండర్ బ్రిడ్జిల వద్ద నీరు నిలవకుండా మోటార్ల ద్వారా ఎప్పటికప్పుడు పంపింగ్ చేయాలని, మ్యాన్‌హోల్స్ వద్ద బ్యారికేడ్స్ ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. నగరంలో ఎక్కడా తాగునీరు కాలుషితం కాకుండా చూడాలన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు వచ్చినా 0877–2256766, 9000822909 నంబర్లను సంప్రదించాలని ప్రజలకు సూచించారు. కమిషనర్ వెంట మునిసిపల్ ఇంజినీర్ గోమతి, డి.ఈ.లు మధు, మహేష్, తదితరులు ఉన్నారు.

అరణియార్ గేట్లు ఎత్తివేత

పిచ్చాటూరు : అరుణానది ద్వారా వరదనీరు ఉధృతంగా వచ్చి చేరుతోంది. బుధవారం ఎంఎల్ఎ ఆదిమూలం అరణియార్ గేట్లను సందర్శించారు. వెంటనే నాలుగు గేట్లను పైకెత్తి అధిక వరద నీటిని బయటకు పంపాలని సూచించారు. మాజీ మార్కెటింగ్ ఛైర్మన్ డి.ఇలంగోవన్‌రెడ్డి, అరణియార్ ప్రాజెక్టు ఆయకట్టు ఛైర్మన్ డి.రవిరెడ్డి, ఢిల్లీబాబు, ఏసు పాల్గొన్నారు.

– ఓజిలి మండలంలో మానమాల, పున్నేపల్లి గ్రామాల్లో భారీ వర్షాలకు వరద ప్రవాహం అధికంగా ఉంది. దీంతో చిలమత్తూరు, మానమాల గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.

– సూళ్లూరుపేటలో తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఎంఎల్ఎ నెలవల విజయశ్రీ ప్రత్యక్షంగాపరిశీలించారు. కాదలూరు గ్రామంలో బ్రిడ్జిపై ప్రవహిస్తున్న నీరు ప్రమాదకరంగా ఉందని, ఈ ప్రాంతానికి హైలెవల్ బ్రిడ్జి అవసరమని సంబంధిత శాఖకు ప్రతిపాదనలు పంపాలని తెలిపారు. ఎమ్మెల్యే వెంట రాష్ట్ర బెస్త కార్పొరేషన్ ఛైర్మన్ శ్రీధర్, సెల్వం, పలణి, సుదర్శన్, ఏకాంబరం, జయపాల్, సుధా, మాజీ సర్పంచ్ చంద్రయ్య, తాసిల్దార్ యన్ శరత్ బాబు, ఎంపీడీవో శేఖర్ నాయక్ పాల్గొన్నారు.

మఠం పక్కన దుకాణాలు మూత

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):

జిల్లాపై ప్రభావం చూపుతున్న దిత్వా తుఫాను దాటికి కురుస్తున్న వర్షాలకు తిరుపతి నగర పరిధిలోని శ్రీ స్వామి హథీరాంజీ మఠంకు ఆనుకొని ఉన్న పూల దుకాణాలను అధికారులు ఎటువంటి ప్రమాదం జరగకుండా ముందస్తుగా షాపులను మూయించారు. ఇప్పటికే మఠం మండువా భవనం దెబ్బ తిన్నదని, దీనిని పునర్ నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వంకు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ ప్రతిపాదనలు పంపిన నేపథ్యంలో మఠం అధికారులు ఈ మేరకు గాంధీ రోడ్డులోని ఉత్తరం వైపు, పడమర వైపు ఉన్న దుకాణాలను బుధవారం ముగించారు. మఠం మండువా భవనం పునర్ నిర్మించాలన్న నిర్ణయంపై డిఆర్సి సమావేశంలో జిల్లా ఇన్చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, ప్రజా ప్రతినిధులు అధికారులతో కలిసి చర్చించారు.

తిరుపతి రైల్వేస్టేషన్‌లో తొక్కిసలాట నివారించాలి : సిపిఎం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి రైల్వేస్టేషన్‌కు ఉదయం ట్రైన్లన్నీ ఒకేసారి రావడంతో ప్రయాణికులు తొక్కిసలాటతో ఇబ్బంది పడుతున్నారని, దీన్ని నివారించాలని సిపిఎం మాజీ ఎంపి పెనుమల్లి మధు సూచించారు. తొక్కిసలాట వల్ల ప్రయాణికులు గాయపడే ప్రమాదం ఉందన్నారు. బుధవారం వేమన విజ్ఞాన కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ తిరుపతి రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనుల్లో జాప్యం లేకుండా పూర్తి చేయాలని, అప్పటివరకూ తొక్కిసలాటను నివారించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మామిడికి గిట్టుబాటు ధర కల్పిస్తామని చెప్పి రైతులకు న్యాయం చేయలేదన్నారు. రైతుల ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో అప్పుల పాలవుతున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రైతుల సమస్యలు గుర్తించి పరిష్కరించకుండా, సభలు, సమావేశాలు, రంగురంగుట ప్రకటనల వల్ల ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. సిపిఎం జిల్లా నాయకులు కందారపు మురళి,జి.బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలని రైల్వేమంత్రికి వినతి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి జిల్లాలో రైల్వే సేవల అభివద్ధికి సంబంధించి కేంద్ర రైల్వే శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్‌తో వైసీపీ లోక్‌సభ ఎంపీ మద్దిల గురుమూర్తి, రాజ్యసభ ఎంపీ, రైల్వే స్టాండింగ్ కమిటీ మెంబర్ మేడా రఘునాథ రెడ్డి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలు కీలక అభ్యర్ధనలు చేశారు. తిరుపతి ప్రాంత రైల్వే వ్యవస్థను బలోపేతం చేయడం, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం కోసం వెంటనే చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని ఆయనకు వివరించారు. కొన్ని దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న బాలాజీ రైల్వే డివిజన్‌ను తిరుపతి కేంద్రంగా ఏర్పాటు చేయాలని మంత్రిని కోరారు. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న సందర్భంగా టిడిపి పార్లమెంటరీ ఫ్లోర్‌లీడర్ లావు కృష్ణదేవరాయులును బాలాజీ రైల్వే డివిజన్ సాధన కమిటి సభ్యులు కుప్పాల గిరిధర్ కుమార్, ప్రముఖ పారిశ్రామికవేత్త డాక్టర్ పిసిరాయలు, ఫిల్మ్ సొసైటీ ఛైర్మన్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, సూరినేని బుజ్జి, బాబునాయుడు, సిటి జిఎం రామచంద్రారెడ్డి కలిసి వినతిపత్రం అందించారు.

నేడు చిత్తూరుకు పవన్ రాక

వర్చువల్‌గా డిడిఒ కార్యాలయాలు ప్రారంభం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ రాష్ట్రవ్యాప్తంగా డిడిఒ కార్యాలయాలను గురువారం వర్చువల్ పద్ధతిలో చిత్తూరు నుండి ప్రారంభించనున్నారు. ఈ మేరకు విజయవాడ నుండి తిరుపతి విమానాశ్రయంకు చేరుకొని ఇక్కడి నుండి రోడ్డు మార్గం గుండా చిత్తూరులోని డిడిఓ నూతన కార్యాలయానికి చేరుకుంటారు. చిత్తూరు నుండి వర్చువల్ పద్ధతిలో రాష్ట్రంలోని 77 డివిజన్ లలో నూతనంగా ఏర్పాటు చేసిన డివిజనల్ డెవలప్మెంట్ ఆఫీస్ లను ప్రారంభించనున్నారు. పంచాయతీల్లో పరిపాలన సౌలభ్యంకు ఈ కార్యాలయాలు ఎంతగానో ఉపయుక్తం కానున్నాయి. తిరుపతి జిల్లా, తిరుపతి డివిజన్ కు సంబంధించి తిరుపతి రూరల్ ఎంపీడీవో కార్యాలయం సమీపంలో డిడిఓ నూతన కార్యాలయం ఏర్పాటు చేసినట్లు డిడిఓ జివి.నారాయణరెడ్డి తెలిపారు.

పని ఒత్తిడితో ఫీల్డ్ అసిస్టెంట్లు బేజారు

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్ (తొట్టంబేడు)

వామపక్షాల పోరాటాల ఫలితంగా ఉపాధి హామీ పనులు గ్రామాల్లో కూలీలకు గుప్పెడు బువ్వ పెడుతున్నాయి. అయితే ప్రభుత్వాల నిర్లక్ష్యంతో ఉపాధి పనులు కల్పించడంలో లోపభూయిష్ట వ్యవస్థ నడుస్తోంది.. ఈ కారణంగా పని ఒత్తిడితో ఫీల్డ్ అసిస్టెంట్లు బేజార్ అవుతున్నారు. ఉండాల్సిన దానికన్నా తక్కువమంది ఉండడంతో ఉన్నవారిపైనే పని ఒత్తిడి ఉంటోంది. మరోవైపు కూలీలకు పనులు చూపడంలోనూ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది.

తొట్టంబేడు మండలంలో మొత్తం 27 పంచాయతీలు ఉన్నాయి. ఉపాధి హామీ పథకం కింద ప్రస్తుతం 6,448 మంది జాబ్ కార్డులు కలిగి ఉన్నారు. సుమారు 1600 మంది వరకు ఉపాధి కూలీలు పని చేయవలసి ఉండగా ప్రస్తుతం ఎనిమిది వందల మంది మాత్రమే పనిచేస్తున్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్షేత్రస్థాయిలో జరగాలంటే ఫీల్డ్ అసిస్టెంట్ల పాత్ర చాలా ప్రధానం. ప్రతి పంచాయతీకి తప్పనిసరిగా ఒక ఫీల్డ్ అసిస్టెంట్ ఉండాల్సిందే. అలా ఉంటేనే ఉపాధి హామీ పనులు ఉసూరుమనకుండా ఊపందుకుంటాయి. కానీ అందుకు విరుద్ధంగా మండలంలో 27 పంచాయితీలు ఉంటే 12 మంది మాత్రమే ఫీల్డ్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహిస్తున్నారు. పొయ్య, పూడి, చిట్టత్తూరు, కొత్త కండ్రిగ, గుండెలు గుంట, చోడవరం, కాసరం, పెద్ద కన్నలి, పెద్ద కనపర్తి, ఇలగనూరు పంచాయతీలలో ఫీల్డ్ అసిస్టెంట్లు లేని కొరత ఇట్టే కనబడుతుంది. ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రతిరోజు ఉదయం లేచి ఉపాధి కూలీల దగ్గరికి వెళ్లి వారికి పనిచేసే ప్రదేశం చూపించి పని అయ్యేంతవరకు వారితోనే ఉండి వారి యొక్క వివరాలను పై అధికారులకు పంపించడంలో కీలక పాత్ర పోషిస్తుంటారు. గతంలో రోజుకు ఒక్క పూట మాత్రమే ఉపాధి కూలీలు పనిచేసేవారు.

పనిచేసేందుకు ముందుకురాని వైనం

కానీ ప్రస్తుతం ప్రతిరోజూ రెండు పూటలు పనిచేయవలసిన పరిస్థితి ఏర్పడింది. ఫీల్డ్ అసిస్టెంట్ల పరిస్థితి పని ఎక్కువ.. జీతం తక్కువ అన్న చందంగా మారింది. ఈ పనిలో వచ్చే జీతం కుటుంబం గడవడానికి ఏమాత్రం సరిపోదు. జీతం తక్కువ కాబట్టే ఫీల్డ్ అసిస్టెంట్ గా చేయడానికి ఎవరూ ముందుకు రావడం లేదని తెలుస్తోంది. ప్రభుత్వం వీరికి జీతం పెంచి ఇస్తే తప్పక అన్ని పంచాయతీలలో ఫీల్డ్ అసిస్టెంట్ల కొరత లేకుండా ఉంటుందని అంటున్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లకు ప్రభుత్వం జీతాలు పెంచాలి..

పెనగడం గురవయ్య. సిఐటియు



గ్రామాలలో ఉపాధి హామీ పనులు క్షేత్రస్థాయిలో జరగాలంటే ఫీల్డ్ అసిస్టెంట్లు తప్పక ఉండాల్సిందే. అయితే ఫీల్డ్ అసిస్టెంట్లకు ప్రభుత్వం ఇస్తున్న జీతం చాలా తక్కువ కాబట్టే ఫీల్డ్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహించటానికి చాలావరకు ఎవరు ముందుకు రావడం లేదు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అన్న విధానంలో ప్రతి ఫీల్డ్ అసిస్టెంట్ కి 26 వేల రూపాయలు జీతం ప్రభుత్వం ఇవ్వాలి. ప్రతి పంచాయతీలో ఫీల్డ్ అసిస్టెంట్లు ఉంటేనే ఉపాధి హామీ పథకం సక్సెస్ అవుతుంది. ఉపాధి కూలీలకు పని దొరుకుతుంది.

ఫీల్డ్ అసిస్టెంట్ల కొరత వాస్తవమే : కల్యాణి, ఎపిఒ

ఏ.పీ.ఓ కళ్యాణిని వివరణ కోరగా మండలంలో కొన్ని పంచాయితీలలో ఫీల్డ్ అసిస్టెంట్ల కొరత ఉన్న విషయం వాస్తవమే అని అన్నారు. పై అధికారులకు నివేదిక పంపి ఉన్నామని, త్వరలోనే అన్ని పంచాయతీల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు.

టీటీడీ ఉద్యోగుల్లో భయం భయం..

కల్తీ నెయ్యి కేసులో నెక్ట్స్ అరెస్టయ్యేది ఎవరు..?

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

బ్రహ్మాండ నాయకుడి లడ్డు ప్రసాదంలో కల్తీ నెయ్యి కథ తెల్చే పనికి వేళయింది. కల్తీ నెయ్యి కేసు నిజాలు తేల్చే పనిలో ఉన్న సిట్ ఫైనల్ చార్జ్ షీట్ దాఖలు చేయబోతోంది. ఇప్పటికే 29 మంది నిందితులను కేసులో చేర్చి పలువురిని విచారించిన సిట్ 9 మందిని అరెస్టు చేసింది. మరికొద్ది మందిని నిందితులుగా చేర్చేందుకు మెమోలు దాఖలు చేసింది. గత ప్రభుత్వంలో టీటీడీ చైర్మన్ గా, ఈఓలుగా పనిచేసిన వారిని విచారించింది. డెయిరీ యాజమాన్యాలను, నిందితులను జైలుకు పంపింది. ఇప్పుడు టిటిడి అధికారుల అరెస్టులకు సిద్ధం కావడం.. ఇన్వెస్టిగేషన్ స్పీడ్ అవ్వడంతో.. ఉద్యోగుల్లో భయాందోళనలకు కారణం అయ్యింది. నెక్ట్స్ ఎవరంటూ తీవ్ర చర్చ జరుగుతోంది.

రిమాండ్ రిపోర్టులో సంచలన నిజాలు..

దేశవ్యాప్తంగా సంచలనంగా మారిన తిరుమల శ్రీవారి లడ్డు ప్రసాదంలో కల్తీ నెయ్యి కేసు విచారణ తుది దశకు చేరుకుంది. ఎన్.డి.డి.బి కాఫ్ నివేదిక ఆధారంగా నెయ్యిలో కల్తీని గుర్తించిన టిటిడి శ్రీవారి భక్తులకు అత్యంత ప్రీతి పాత్రమైన లడ్డూ తయారీకి కల్తీ నెయ్యి సరఫరా చేశారన్న అభియోగాలు, ఆరోపణల్లో నిజాలు నిగ్గు తేల్చే పనిలో ఇన్వెస్టిగేషన్ కొనసాగిస్తోంది. సీబీఐ నేతత్వంలోని 5 మంది సభ్యులతో ప్రత్యేక దర్యాప్తు బందం డిసెంబర్ 15 లోపు ఫైనల్ చార్జ్ షీట్ దాఖలు చేయాలని నిర్ణయించింది. సిట్‌లో సీబీఐ తరపున మురళి రాంబా కీలకంగా వ్యవహరిస్తుండగా సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షణలో సిట్ పని పూర్తి చేస్తోంది. క్షేత్రస్థాయిలో దర్యాప్తు పూర్తి చేసిన సిట్ అలిపిరిలోని భూదేవి కాంప్లెక్స్ కేంద్రంగా ఏడాదిగా విచారణ చేస్తోంది.

ఇందులో భాగంగానే కల్తీ నెయ్యి కేసు దర్యాప్తు తుది దశకు చేరుకుంది. ఈ నేపథ్యంలోనే టీటీడీ ఉద్యోగుల్లో కల్తీ నెయ్యి కేసు భయం నెలకొంది. కేసులో ఏ 29 గా టీటీడీ ప్రొక్యూర్మెంట్ జీఎం గా పనిచేసిన సుబ్రహ్మణ్యం అరెస్ట్ కావడంతో ఫియర్ పిక్స్ కు చేరుకుంది. ఇప్పటికే నిందితులుగా ఉన్న ఉద్యోగులను కూడా అరెస్టు చేసే అవకాశం ఉందని భావిస్తున్న పరిస్థితి వెంటాడుతోంది. అంతేకాకుండా.. పలువురిని విచారించే అవకాశం ఉన్నట్లు సమాచారం..

సుబ్రహ్మణ్యం రిమాండ్ రిపోర్టులో కల్తీ నెయ్యి సరఫరాపై సంచలన విషయాలు బయటపడ్డాయి. కల్తీ నెయ్యిని స్వచ్ఛమైన ఆవు నెయ్యిగా టీటీడీకి సరఫరా జరిగేలా సహకరించింది సుబ్రహ్మణ్యమే నని సిట్ రిమాండ్ రిపోర్టులో పేర్కొంది. బోలే బాబా డెయిరీ నుంచి రూ. లక్షల్లో లంచం, విలువైన కానుకలు సుబ్రహ్మణ్యం అందుకున్నట్లు సిట్ నిర్ధారణకొచ్చింది. బోలే బాబా, వైష్ణవి డెయిరీలను తనిఖీ చేయడానికి వెళ్లిన అధికారులు విలువైన వస్తువులు, నగదు పొందినట్లు రిమాండ్ రిపోర్టులో స్పష్టం చేసింది. కేసులో ఎ24 గా ఉన్న చిన్నఅప్పన్న కు సహకరించి నెయ్యి సప్లై చేసిన కంపెనీలతో సుబ్రహ్మణ్యంతో పాటు మరికొందరు లాలూచీ పడినట్లు సిట్ గుర్తించింది. మైసూర్ ల్యాబ్ రిపోర్టును దాచి బోలే బాబా డెయిరీ కి రెండు దఫాల్లో దాదాపు 1.20 లక్షల కిలోల వరకూ నెయ్యి సరఫరాకు ఆర్డర్లను ఇవ్వడంలో సుబ్రహ్మణ్యం కీలకపాత్ర పోషించినట్లు సిట్ తెలిపింది. నెయ్యి సరఫరాకు సాంకేతికంగా అర్హత పొందిన సంస్థలకు లబ్ది చేకూర్చేలా టెండర్ల ప్రక్రియను నిర్వహించేలా అప్పటి టిటిడి ప్రొక్యూర్మెంట్ జిఎం సుబ్రహ్మణ్యం ప్రయత్నించినట్లు సిట్ పేర్కొంది.

మరింత మంది పాత్రపై కోర్టులో మెమో..

మరోవైపు కల్తీ నెయ్యి కేసు దర్యాప్తును ముగించే దశలో ఉన్న సిట్ టిటిడి మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని హైదరాబాదులో, టీటీడీ మాజీ ఈఓ ధర్మారెడ్డిని తిరుపతిలో రెండు రోజులు పాటు విచారించింది. ఇలా కల్తీ నెయ్యి సరఫరా కేసులో అప్పటి పాలకమండలిని, అధికారులను, నెయ్యి సరఫరా చేసిన సంస్థల ప్రతినిధులను, సహకరించిన వారిని విచారించింది. అయితే టీటీడీకి కల్తీ నెయ్యి సరఫరా కేసులో ఉద్యోగుల పాత్ర కూడా కీలకమని సిట్ విచారణలో తేలడంతో ఇప్పుడు కొందరు ఉద్యోగుల వెన్నులో వణుకు పుట్టిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఎ24 నుంచి ఎ36 వరకు మరో 12 మంది నిందితులను కేసులో చేర్చేందుకు సిట్ సిద్ధమైంది. ఈ మేరకు నెల్లూరు కోర్టులో మెమో దాఖలు చేసింది.

నిందితుల్లో ఏడుగురు టిటిడి ఉద్యోగులు తోపాటు ఐదుగురు డెయిరీ లకు చెందిన వారుగా పేర్కొన్న సిట్ అధికారులు.. 2019 నుంచి టిటిడి ప్రొక్యూర్మెంట్ జనరల్ మేనేజర్ లుగా, వేర్ హౌసింగ్, గోశాల డయిరీ ఉద్యోగులు గా పనిచేసిన వారిని నిందితులుగా తేల్చింది. డెయిరీ శాంపిల్స్ సేకరించి నిపుణుల నివేదిక ఇవ్వాలని 2022 మే నెలలో అప్పటి టిటిడి చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఆదేశించగా ఇదే అదునుగా అక్రమాలు జరిగినట్లు సిట్ భావిస్తోంది.. 2018 నుంచి 2024 వరకు నెయ్యి సరఫరా చేసిన డెయిరీ ప్లాంట్ సందర్శించిన నిపుణులు కమిటీ నివేదికను, ల్యాబ్ రిపోర్టులను పక్కన పెట్టి ఇదే అవకాశంగా చేసుకుని కొందరు డయిరీ యాజమాన్యాల నుంచి ముడుపులు, కానుకలను పొందినట్లు సిట్ తేల్చింది. ఇలా కక్కుర్తి పడ్డ వారిలో నిపుణులు, టిటిడి ప్రొక్యూర్మెంట్ జీఎంలు, కొందరు ఉద్యోగులు ఉన్నట్లు సిట్ ఛార్జ్ షీట్ వేయబోతుండటం సంచలనంగా మారింది.

'ప్రధానమంత్రి స్వనిధి'కి విరివిగా రుణాలు : కమిషనర్



ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ప్రధానమంత్రి స్వనిధి పథకానికి బ్యాంకర్లకు కేటాయించిన లక్ష్యాల మేరకు రుణాలను మంజూరు చేయాలని కార్పొరేషన్ కమిషనర్ ఎన్.మౌర్య బ్యాంకర్లను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా ఎల్‌డిఒ రాజేష్‌కుమార్, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా డిప్యూటీ ఆర్‌ఎం పరమేశ్వర్ నాయక్, నాబార్డ్ డిడిఎం సునీల్, ఎల్‌డిఎం రవికుమార్‌లతో కలిసి త్రైమాసిక సమావేశం నిర్వహించారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు, ఎస్‌హెచ్‌జిలు, వ్యవసాయ, పాడి రైతులకు రుణాలను నిర్దేశించిన లక్ష్యాల మేరకు విరివిగా మంజూరు చేయాలని తెలిపారు. క్రాప్ లోన్స్‌కు అర్హత కలిగిన లబ్దిదారులకు క్రాప్ ఇన్స్యూరెన్స్ కవర్ అయ్యేలా చూడాలన్నారు. బిసి, ఎస్‌సి, మైనార్టీ కార్పొరేషన్ రుణాలను సద్వినియోగం చేసుకునేలా బ్యాంకర్లకు ఇచ్చిన లక్ష్యాలను చేరుకోవాలన్నారుర. ఫుడ్ ప్రాసెసింగ్ సంబంధించిన దరఖాస్తులను పరిశీలించి రుణాలను సకాలంలో మంజూరు చేయాలని తెలిపారు.

ఈ సమావేశంలో డిఆర్డిఏ పిడి శోభన్ బాబు, జిల్లా వ్యవసాయ, హార్టి కల్చర్, పశు సంవర్ధక శాఖ అధికారులు ప్రసాద్, దాశరథ రామి రెడ్డి, రవి కుమార్, మెప్మా పిడి ఇక్రైన్, మేనేజర్లు, బ్యాంకర్లు, ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సిఎంను కలిసిన గాలి చలపతినాయుడు

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్ (తొట్టంబేడు)



తొట్టంబేడు మండలం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గాలి చలపతి నాయుడు బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును మర్యాదపూర్వకంగా కలిసారు. మదనపల్లి టిడిపి పరిశీలకులుగా ఉన్న ఆయన ప్రస్తుతం పార్టీ పరిస్థితులపై వివరాలు అందజేయడం జరిగిందని తెలిపారు.

రేపు డయల్ యువర్ ఈవో

ప్రజాశక్తి -తిరుమల

డయల్ యువర్ ఈవో కార్యక్రమం డిసెంబర్ 5వ తేదీ శుక్రవారం ఉదయం 9 నుండి 10 గంటల వరకు తిరుమల అన్నమయ్య భవనంలో జరగనుంది. ఈ కార్యక్రమంలో భక్తులు తమ సందేహాలను, సూచనలను టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్‌కు ఫోన్ ద్వారా నేరుగా మాట్లాడి తెలుపవచ్చు. ఇందుకు భక్తులు సంప్రదించవలసిన నెంబరు 0877–2263261.

అప్పలాయగుంట చెరువేనని తీర్పు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి నానాటికీ ఆక్రమణకు గురవుతున్న అప్పలాయగుంట చెరువును కాపాడడంలో శ్రీకాళహస్తి రెవెన్యూ అధికారులు ముందడుగు వేశారు. అది చెరువు కాదనీ, తమకు గతంలో రైతు వారీ పట్టాలు ఇచ్చినట్లుగా కొందరు సీసీఎల్ఏ కోర్టుకు వెళ్లారు. వారికి వ్యతిరేకంగా శ్రీకాళహస్తి రెవెన్యూ అధికారులు వ్యాజ్యం దాఖలు చేశారు. వాదోపవాదనలు విన్న విజయవాడ సీసీఎల్ఏ కోర్టు నవంబరు 6వ తేదీన రెవెన్యూ శాఖకు అనుకూలంగా తీర్పునిచ్చింది. చెరువును భావితరాల కోసం కాపాడాలని ఆదేశించింది. అప్పలాయగుంట చెరువును కాపాడడంలో రెవెన్యూ అధికారులు చేసిన కృషిని, పోరాటాన్ని పలువురు అభినందించారు.

అనాథ ఆశ్రమానికి ఆర్థిక చేయూత

ఆర్థిక సాయం అందిస్తున్న దాత

ప్రజాశక్తి-నాయుడుపేట: నాయుడుపేట పట్టణంలోని మేరీ అనాథ ఆశ్రమ భవన నిర్మాణానికి వైసిపి నేత, నాయుడుపేట మండలం మేన కూరు వద్ద ఉన్న హర్ష పెట్రోలియమ్స్ అధినేత కట్టా భవాని శంకర్ రెడ్డి ఆర్థిక చేయూత అందించారు. బుధవారం మేరీ అనాథ ఆశ్రమ నిర్వాహకులు సునీత బెన్నీక్ భవన నిర్మాణం నిమిత్తం పదివేల రూపాయల సాయం అందించారు. ఈ సందర్భంగా సునీతా బెన్నీ మాట్లాడుతూ భవాని శంకర్ రెడ్డి ఎంతో మంచి మనసు కలిగిన ఆయన పేదలకు ఎవరికీ తెలియని ఎన్నో సహాయాలు చేశారని నిత్యం చేస్తుంటారని ఆయన పేరు రావాలని కోరుకునే వ్యక్తి కాదన్నారు. కట్టా భవాని శంకర్ రెడ్డికి ఆశ్రమ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

దేవాలయ నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు మండల పరిధిలోని గొల్లపల్లిలో కొమ్మ వీరుడు దేవాలయ నిర్మాణానికి 50 వేల రూపాయలను మంగళపూరుకి చెందిన వైసీపీ సీనియర్ నాయకులు యద్దల నరేంద్రరెడ్డి బుధవారం విరాళంగా ఇచ్చారు. ఈ విరాళాన్ని దేవస్థాన సభ్యులకు గూడూరు ఎంపీపీ బూదురు గురవయ్య, అట్ల శ్రీనివాసులు రెడ్డిలు కలిసి బుధవారం అందించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు సుధాకర్ పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

ప్రజాశక్తి- పిచ్చాటూరు: పిచ్చాటూరు మండలం కీలపూడి గ్రామ సచివాలయాన్ని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఎమ్మెల్యే కీలపూడి గ్రామ సచివాలయానికి ఉదయం చేరుకొని ఉద్యోగుల హాజరు పట్టికను పరిశీలించారు.అనంతరం కార్యాలయంలోని రికార్డులు పరిశీలించి ఉద్యోగులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు మాజీ మార్కెటింగ్ ఛైర్మన్ డి ఇలంగోవన్ రెడ్డి, పిచ్చాటూరు ఆయకట్టు ఛైర్మన్ డి రవిరెడ్డి, ఢిల్లీ బాబు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

6న జాబ్ మేళా

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని డీఆర్‌డబ్ల్యూ కళాశాలలో ఈనెల 6వ తేదీ నిర్వహించే జాబ్ మేళాలో నిరుద్యోగులు పాల్గొని ఉద్యోగాలు పొందాలని ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ తెలిపారు. గూడూరు పట్టణంలోని షాదీ మంజిల్‌లో జాబ్ మేళాకు సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ జాబ్ మేళాలో 15 కంపెనీలు పాల్గొంటున్నాయని, నిరుద్యోగులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అన్ని రంగాల్లో ముందుండాలి..

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఆత్మవిశ్వాసంతో ప్రత్యేక ప్రతిభావంతులు అన్ని రంగాల్లో రాణించాలని అందరికీ స్ఫూర్తిగా నిలవాలని పుత్తూరు సీనియర్ న్యాయవాది మురుగేష్ రెడ్డి, పేర్కొన్నారు. ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా పుత్తూరు మదర్ థెరిసా బదిరుల పాఠశాలలో పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర ఆదేశాలు మేరకు బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సమావేశంలో సీనియర్ న్యాయవాది మురుగేషరెడ్డి, మాట్లాడుతూ. దివ్యాంగులు ఆత్మ స్థైర్యంతో అన్ని రంగాల్లో ముందు కెళ్లాలని, విభిన్న ప్రతిభావంతులు, ప్రతి ఒక్కరూ వారి హక్కులను తెలుసుకోవాలని, ధైర్యంగా నిలబడాలన్నారు. ఈ కార్యక్రమంలో మదర్ థెరిసా పాఠశాల కరస్పాండెంట్ కటారి శివయ్య, సుబ్రహ్మణ్యం, సెక్రటరీ సురేష్ కుమార్ యాదవ్, మనోహర్, వరలక్ష్మి, విద్యార్థులు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఓజిలి: ఓజిలి భవిత పాఠశాలలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశా నికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ మాట్లాడుతూ వికలాంగులలో ఎక్కువ భాగం సరైన వైద్య అవగాహన లేక పౌష్టికాహార లోపం వల్ల మానసిక ఒత్తిడికి లోనయ్యి దివ్యాంగులుగా జన్మిస్తున్నారని, వారు మామూలు పిల్లల కంటే ఏమి తీసిపోరని తెలిపారు. వారిలో నూతన చైతన్య వరవడిని నెలకొల్పితే ఎంతో ఉన్నత స్థాయికి ఎదుగుతారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్పి బండికీర్తన, దాసరి శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలాయపల్లి: అన్ని రంగాల్లో దివ్యాంగుల విశ్వాసం, పట్టుదల అందరికీ ఆదర్శంగా ఉంటుందని బాలాయపల్లి ఎంఈఓ నాగేశ్వరరావు పేర్కొన్నారు. విభిన్న ప్రతిభా వంతుల దినోత్సవాన్ని స్థానిక ఎంపీపీఎస్ పాఠశాల బాలాయపల్లిలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ ఉషారాణి, పాఠశాల హెచ్ ఎం దేవసేన, ఐఈ ఆర్‌టి టీచర్ డివి శోభారాణి, ఉపాధ్యాయులు జి పద్మ , డి లక్ష్మీ , ఏ సుబ్రమణ్యం లిబియా,, కిషోర్ బాబు, ఆయాలు ఈశ్వరమ్మ, పుల్లమ్మ పాల్గొన్నారు.

కోట : కోట మండలం కోట పట్టణంలోని ఎమ్ ఈ ఓ కార్యాలయంలో బుధవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దివ్యాంగ విద్యార్థులకు ఆటపాటలు, వివిధ రకాల పోటీలను నిర్వహించారు. కోట మండల ఎంఈఓ-1 శిరీష, ఎంఈఓ-2 దారా.మస్తానయ్య,టీడీపీ మైనారిటీ నాయకులు షేక్.జలీల్ అహ్మద్ లు విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. దివ్యాంగులు అన్నీ రంగాల్లో అభివృద్ధి చెందుతున్నారన్న ఆత్మవిశ్వాసాన్ని వారికీ కలిగించారు.

ఆలయాల్లో హుండీలకు భద్రత కరువు

పుదుకుప్పం ఆలయాల్లో చోరీ

ప్రజాశక్తి - సత్యవేడు : తిరుపతి జిల్లా సత్యవేడు మండలం పుదుకుప్పం గ్రామంలోని పలు ఆలయాల్లో చోరీ జరిగింది. మండలంలోని పలు గ్రామాల్లో దుండగులు ఆలయాలను లక్ష్యం చేసుకుని వరుస దోపిడీలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి పుదుకుప్పం గ్రామంలోని మూడు ఆలయాల్లో చోరీ జరిగింది. గ్రామస్తుల కథనం మేరకు... మంగళవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు కొందరు ఆలయాల తలుపుల తాళాలను పగలగొట్టి లోనికి ప్రవేశించి అమ్మవారికి అలంకరించిన బంగారు ఆభరణాలతోపాటు హుండీలను పగలగొట్టి అందులోని నగదును అపహరించుకొని వెళ్లారని తెలిపారు. ఈ క్రమంలో అంకాలమ్మ దేవాలయంలో నాలుగు గ్రాముల బంగారం, రోజమ్మ గుడిలో మరో నాలుగు గ్రాముల బంగారం ఆభరణాలను, ఓం శక్తి గుడిలో హుండీ పగలగొట్టి దుండగులు దోచుకెళ్లినట్లు స్థానికులు ఆరోపించారు. మూడు ఆలయాల్లో అపహరించిన బంగారు ఆభరణాలు, హుండీ సొమ్ము సుమారు ఒక లక్ష పదివేల రూపాయలు విలువ చేస్తుందని గ్రామ పెద్దలు తెలిపారు. మండలంలో పలు ఆలయాల్లో వరుస చోరీలు జరుగుతున్న నేపథ్యంలో ఇదంతా పథకం ప్రకారం ఓ ముఠా గ్రామాలను ఎంచుకొని ఆలయాల్లో చోరీకి పాల్పడుతున్నారన్న అనుమానాన్ని కొందరు గ్రామస్తులు వ్యక్త పరుస్తున్నారు. గతంలో సత్యవేడు పట్టణం, మదనం బేడు, పేరడం గ్రామాల్లోని ఆలయాలలో చోరీకి పాల్పడి దోచు కెళ్లారు. ఈ చోరీలపై పోలీసు వారు దృష్టి సారించి సమగ్ర విచారణ చేసి దుండగులను పట్టుకుని కఠినంగా శిక్షించి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరారు. అవసరమైతే గ్రామాల్లోని గుడుల వద్ద ప్రతిరోజు గస్తీ నిర్వహించి ఇలాంటి సంఘటనలు జరగకుండా నివారించాలని కోరుతున్నారు. స్థానిక ఎస్సై రామస్వామిని వివరణ కోరగా దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అధికారుల స్పందన

- విద్యుత్ సరఫరా - అందిన తాగునీరు..

పర్యవేక్షిస్తున్న విద్యుత్ అధికారులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : దిత్వా తుపాన్ ప్రభావంతో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పుత్తూరు మండలంలోని అతిపెద్ద చెరువు గూళూరు పూర్తిగా నిండిపోయి కలుజు పారుతున్న విషయం విదితమే.. దీంతో చెరువు కింద గ్రామాలు ఎగువ, దిగువ గూళూరుకు విద్యుత్ సరఫరా నిలిచిపోయి చెరువు నిండి పోవడంతో విద్యుత్ తీగలు తెగిపడిపోయి సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ మూడు గ్రామాలకు రెండు రోజులుగా గ్రామాల్లో విద్యుత్ సరఫరా లేక పోవడంతో తాగునీటికి సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో ఆ గ్రామ ప్రజలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశరు. కలెక్టర్ స్పందించి సంబంధిత అధికారులను అప్రమత్తం చేశారు. స్పందించిన విద్యుత్ డిఈ దేవా ఆశీర్వాదం, ఏడి రమేష్, ఏఈ జయసాయి, లైన్‌మ్యాన్ పద్మనాభం చెరువు వద్దకు చేరుకొని బోటుపై వెళ్లి విద్యుతు లైను పునరుద్ధరించారు. డిఈ దేవా ఆశీర్వాదం మాట్లాడుతూ త్వరలోనే విద్యుత్‌కు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రెండు రోజులకే పింఛన్లు పరిమితం

- అంతర్జాల సేవలు నిలిపివేత- పలువురికి అందని పింఛన్లు

ప్రజాశక్తి - వరదయ్యపాలెం: పింఛన్లు పంపిణీ గడువు ఇంకా పూర్తి కాకముందే పింఛన్లు పంపిణీని రెండు రోజులకే పింఛను సైట్‌ను ప్రభుత్వం మూసివేయడంతో పింఛన్లు పంపిణీకి ఇబ్బంది ఏర్ప డింది. దీంతో పలువురికి పింఛను అందక పోవడంతో లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు తుపాన్ ప్రభావంతో వారం రోజులుగా వర్షం కురుస్తుండటంతో వాతావరణం కారణంగా అన్ని రకాల నెట్ వర్క్ సిగ్నల్స్ పని చేయడం లేదని అందరికీ తెలిసిందే. దీంతో పింఛన్లు పంపిణీకి నెట్ వర్క్ సిగ్నల్స్ పని చేయని కారణంగా పింఛను సర్వర్లు పని చేయక పింఛన్లు పూర్తి స్థాయిలో పంపిణీ చేయలేదు. దీంతో సిబ్బంది మూడవ తేదీ పంపిణీ చేయడానికి సిద్ధం అవుతుండగా, పింఛన్ల సైట్‌ను మూసివేయడంతో పింఛన్లు పంపిణీ చేయలేని పరిస్థితి నెలకొంది. దీంతో లబ్ధిదారులు, వృద్ధులు, వితంతువులు, వికలాంగులు ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. వర్షాల సమయంలో పింఛను అందక నగదు కోసం అవస్థలు పడుతున్నారు. మండలంలో దాదాపు 40 శాతం పంపిణీ చేయాల్సి ఉండగా అధికార యంత్రాంగం తీరుతో పంపిణీ చేయలేని పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి పింఛన్ల సైట్ ఓపెన్ చేయాలని బాధితులు వేడుకుంటున్నారు.

కుక్కలు, కోతుల బెడదను నివారించండి..

కమిషనర్‌కు వినతి

కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఛైర్మన్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : గత కొంతకాలంగా పుత్తూరు మున్సిపాల్టీలోని 27వ వార్డులలో కుక్కలు, కోతుల బెడద ఎక్కువైందని, వాటి నివారణకు చర్యలు తీసు కోవాలని కమిషనర్‌కు మున్సిపల్ ఛైర్మన్ ఏ హరి, వైస్ ఛైర్మన్ డి జయ ప్రకాష్, కౌన్సిలర్లు, కలిసి మున్సిపల్ కమిషనర్ నాగేశ్వరరావుకు బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోతుల బెడద, పిచ్చికుక్కల బెడద అధికంగా వుందని తరచూ కుక్కలు ప్రజలను గాయ పరుస్తుండడంతో ఆస్పత్రికి వెళ్లాల్సి వస్తోందన్నారు. గత నెలలో సుప్రీంకోర్టు సైతం జన సంచార ప్రదేశాల్లో కుక్కలను అరికట్టాలని ఆదేశించిన సంగతి గుర్తు చేశారు. పుత్తూరు పురపాలక పరిధిలోని అన్ని వార్డులలో విపరీతంగా పెరిగిన కుక్కల వల్ల ఏర్పడు తున్న సమస్యను తక్షణమే పరిష్కరించాలని, భయాందోళనలను తొలగించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఏకాంబరం, భానుమతి చక్రపాణి పాల్గొన్నారు.

వైభవంగా నాలుగు గంగమ్మల జాతర

జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే పులివర్తినాని

ప్రజాశక్తి -చంద్రగిరి: చంద్రగిరిలో నాలుగు గంగమ్మల జాతర బుధవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం 4 గంటలకు నాలుగు గంగమ్మల ప్రతిమల మూర్తులు మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, కోలాహలమైన ఆటపాటల నడుమ పట్టణంలో ప్రతిష్ఠించారు. భక్తులు అధిక సంఖ్యలో కుంభాలు ఉంచి పూజలు నిర్వహించారు. ఎలాంటి ఆటంకాలు, అవాంఛనీయ సంఘటనలు లేకుండా, నాలుగు గంగమ్మల జాతర విజయ వంతంగా నిర్వహించారు. ఎమ్మెల్యే పులివర్తి నాని ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే జాతర ఏర్పాట్లను పర్యవేక్షించి, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడా లని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి మండల ప్రజలు, భక్తులు, మహిళలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

భూ సమస్య ..ఇద్దరు ఘర్షణ

నోటీసు బోర్డు ఏర్పాటు చేసిన తహాశీల్దారు

నోటీసు బోర్డు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ అధికారులు

ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ: భూ సమస్యకు సంబంధించి ఇద్దరు ఘర్షణ పడ్డారు. ఒకరిపై ఒకరు కేసులు బనాయించు కోవడంతో స్పందించిన తహాశీల్దారు వారి భూమిలో బుధవారం నోటీసు బోర్డు ఏర్పాటు చేశారు. నీర్పకోట గ్రామ రెవెన్యూ సర్వే నంబర్ 87/9లోని 29 సెంట్లు భూమి కాంపాళ్యం గ్రామానికి చెందిన గోపికృష్ణ, నీర్పకోటకు చెందిన వారు ఘర్షణ పడి ఒకరిపై మరొకరు కేసులు బనా యించారు. ఇందులో కాంపాళ్యంకు చెందిన గోపికృష్ణ కొద్ది రోజులు జైలు శిక్ష అను భవించారు. అనంతరం బుచ్చినాయుడు కండ్రిగ మండల తహాశీల్దారు ఈ విషయంపై చొరవ తీసుకొని రెవెన్యూ సిబ్బందితో సంఘటన స్థలానికి వెళ్లి భూమిని పరిశీలించగా 87/9లో ఉన్న 29 సెంట్లు భూమిని ప్రభుత్వ భూమిగా నిర్ధారించి ఆ భూమిలో తహాశీల్దారు శ్రీదేవి ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది హెచ్చరిక బోర్డులో ఏర్పాటు చేశారు. ఈ భూమిలో ఎవరూ రాకూడదని, ఉత్తర్వులు ధిక్కరించి ఆ ప్రవేశిస్తే చట్టరీత్యా సివిల్, క్రిమినల్ కేసులు బనాయిస్తామని తహాశీల్దారు శ్రీదేవి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో వెంకటేశ్వర్లు, తేజ రెడ్డి, మధు, సర్వేయర్ హరీష్ పాల్గొన్నారు.

టిడిపి సమావేశం

ప్రజాశక్తి-ఏర్పేడు: దుగ్గిపేరి, పల్లాంపేట పంచాయతీలో బూత్ స్థాయిలో టీడీపీని బలోపేతం చేసి ఓటింగ్ శాతం పెంచడానికి మండల టీడీపీ అధ్యక్షులు పేరం నాగరాజ నాయుడు ఆధ్వర్యంలో విస్తృతస్థాయి సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో నాయీ బ్రాహ్మణ రాష్ట్ర ఛైర్మన్ సదాశివామ్, సీనియర్ నాయకులు పేరం ధనంజయులు నాయుడు, శివశంకర్ రెడ్డి, పాపిరెడ్డి, నైనూరు పున్నారావు, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు గాలి క్రిష్ణవేణి, ఏర్పేడు పిఎసిఎస్ ఛైర్మన్ మహేష్ రెడ్డి పాల్గొన్నారు.

బ్లడ్ గ్రూపు తెలుసుకోవడం ముఖ్యం

విద్యార్థినులకు బ్లడ్ గ్రూపు పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ వారి వారి బ్లడ్ గ్రూప్ తెలుసు కోవడం ఎంతో ముఖ్యమని శ్రీకృష్ణ సేవా సమితి, తిరుపతి జిల్లా టెన్నికాయిట్ అధ్యక్షులు డాక్టర్ (బండి శ్యామ్ సుందర్ రావు) మయూరి శ్యామ్ యాదవ్ పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని మినీ గురుకులం (బాలికలు)లో మయూరి శ్యామ్ యాదవ్, చెన్నూరు ప్రాంతీయ ఆరోగ్య కేంద్రం సహకారంతో 97 మంది పిల్లలకు బ్లడ్ గ్రూపు టెస్ట్ నిర్వహించి వారి వారి బ్లడ్ గ్రూపులు తెలిపారు. ఈ సందర్భంగా మినీ గురుకులం హెచ్ఎం కెవి రజనీకుమారి మాట్లాడుతూ పిల్లలందరికీ బ్లడ్ గ్రూప్ టెస్ట్ చేసి వారి వారి బ్లడ్ గ్రూపులు తెలిపిన దాత మయూరి శ్యామ్ యాదవ్‌కు కృతజ్ఞతలని, హెల్త్ సూపరువైజర్ మస్తానయ్య, ల్యాబ్ టెక్నీషియన్ దినేష్ రెడ్డి, హెల్త్ అసిస్టెంట్ నూర్ బాషా, ఎంఎల్‌హెచ్‌పి చాలీసా ఇతర సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. మయూరి శ్యామ్ యాదవ్ మాట్లాడుతూ అత్యవసర సమయంలో రక్తం అవసరమైనప్పుడు బ్లడ్ గ్రూప్ తెలిసి ఉంటే, త్వరగా రక్తం అందించే అవకాశం ఉందని, అందరూ వారివారి బ్లడ్ గ్రూపులు తెలుసుకోవడం ఎంతో అవసర మన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కెవి రజనీకుమారి, దాత మయూరి శ్యామ్ యాదవ్, హెల్త్ సూపరువైజర్ మస్తానయ్య, వారి సిబ్బంది, ఉపాధ్యాయునులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి -చంద్రగిరి: చంద్రగిరి నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో తిరుపతి, పాకాల, చంద్రగిరి, రామ చంద్రాపురం, యర్రావారిపాలెం, చిన్నగొట్టిగల్లు మండలాలకు చెందిన పలువురికి సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పులివర్తినాని బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సుమారు 37 లక్షల 40 వేల 528 రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. అనారోగ్య , ఇతర సమస్యలతో బాధపడుతున్న విషయం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లగా తక్షణమే స్పందించి రాష్ట్ర సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు మంజూరు చేశారన్నారు. కష్టకాలంలో తమ కుటుంబాలను ఆదుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్యే పులివర్తి నానికి లబ్ధిదారులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెట్ల కొమ్మలు తొలగింపు

ప్రజాశక్తి- సత్యవేడు: మొంథా తుపాన్ ప్రభావంతో సత్యవేడు మండలంలో ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురు స్తున్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం సత్యవేడు- ఉత్తుకోట రహదారిపై వెంకట రాజుల కండ్రిగ వద్ద వేగంగా వీచే గాలులకు చెట్టు నేలకొరిగి రవాణా అంతరాయం కలిగింది. ఈ సమాచారం తెలుసుకున్న స్థానిక ఎస్ఐ రామస్వామి తన బృందంతో వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని రహదారిపై పడి ఉన్న చెట్ల కొమ్మలను తొలగించి రవాణా అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టారు. అనంతరం వెంకటరాజుల కండ్రిగ ప్రధాన రహదారిపై నిర్మించిన తాత్కాలిక కల్వర్టు వద్ద వరద నీటి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ భాస్కర్ రెడ్డి, కానిస్టేబుల్ గుణశేఖర్, హోంగార్డ్ పద్మనాభం, పలువురు స్థానిక యువకులు తదితరులు పాల్గొన్నారు.

వీరస్వామికి నివాళులు

ప్రజాశక్తి -శ్రీకాళహస్తి రూరల్ (తొట్టంబేడు): టిడిపి సీనియర్ నాయకులు వీరాస్వామి కర్మ క్రియలకు బుధవారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి హాజరయ్యారు. మొదట వీరాస్వామి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరాస్వామి టిడిపికి ఎంతో కష్టపడ్డారని తెలిపారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని, పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తొట్టంబేడు మండల టిడిపి అధ్యక్షులు రావిళ్ళ మునిరాజు నాయుడు, టిడిపి నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తెలంగాణ గవర్నర్‌ను కలిసిన టిటిడి ఛైర్మన్

ప్రజాశక్తి -తిరుమల: తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను హైదరాబాద్ గవర్నర్ బంగ్లాలో బుధవారం మర్యాద పూర్వకంగా టిటిడి ఛైర్మన్ బీఆర్ నాయుడు కలిసారు. ఈ సందర్భంగా గవర్నర్‌ను స్వామి వారి శాలువాతో సత్కరించి, తీర్థప్రసాదాలను అందించారు. టిటిడిలో భక్తులకు అందిస్తున్న అన్నప్రసాదాలు రుచికరంగా, నాణ్యంగా ఉన్నాయని, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలు భేషుగ్గా ఉన్నాయని గవర్నర్ అభినందించారు.త్రిపురలో శ్రీవారి ఆలయాన్ని నిర్మించాలని టిటిడి ఛైర్మన్ బీఆర్ నాయుడును కోరారు. త్రిపురలో శ్రీవారి ఆలయానికి స్థలం కేటాయిస్తే ఆలయ నిర్మాణాన్ని టిటిడి చేపడుతుందని తెలిపారు.

దారి సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పుత్తూరు మండలంలోని తడుకు గ్రామం వద్ద అండర్ బ్రిడ్జిలో నీళ్ల చేరిపోవడంతో తడుకు, ఎగువ గూళూరు దిగువ గూళూరు శిరుగురాజుపాలెం, పొట్టిగుట్ట, ఐదు గ్రామాలకు రాకపోకలకు అంతరాయం కలిగింది. వీటిని రైల్వే అధికారులు స్పందించకపోవడంతో గ్రామస్తులు ఎంపీడీవోకి ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎంపీడీవో పద్మావతి శ్రీదేవి పంచాయతీ కార్యదర్శి అనిల్ చొరవ తీసుకుని అండర్ బ్రిడ్జిలో నిలిచి ఉన్న నీటిని మోటార్ సాయంతో తొలగించారు. దీంతో రాకపోకలు సమస్య పరిష్కారమైంది.

క్రైం న్యూస్

రోడ్డు ప్రమాదంలో అయ్యప్ప భక్తులు మృతి

ప్రజాశక్తి-వరదయ్యపాలెం: రోడ్డు ప్రమాదంలో అయ్యప్ప భక్తులు మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వరదయ్యపాలెం మండలం గోవర్ధనపురం గ్రామానికి చెందిన నరేష్ తన తండ్రి వేణు, కూతురితో కలిసి డ్రైవర్‌తో పాటూ శబరిమల యాత్రకు సోమవారం బయలుదేరాడు. ఇందులో భాగంగా దర్శనం అనంతరం వెంటనే తిరుగు ప్రయాణం కావడంతో మార్గం మధ్యలో నిద్ర మత్తులో రోడ్డు పక్కన ఉన్న కల్వర్టును డ్రైవరు ఢీకొన్నాడు. దీంతో నరేష్(30) అక్కడికక్కడే మృతి చెందాడు. తన తండ్రి వేణు(50) మృతి చెందగా పాపకు తీవ్ర గాయాలయ్యాయి. డ్రైవర్ కి రెండు కాళ్లు విరగడంతో స్థానికంగా ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేయించారు. ఈ ప్రమాదం కేరళ సమీపంలోని తేనె అనే గ్రామం వద్ద మంగళవారం ప్రమాదం చోటుచేసు కుందని కుటుంబీకులు తెలిపారు.

కామేశ్వరికి డాక్టరేట్

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: స్విమ్స్ యూనివర్సిటీ ఫిజియోథెరపి విభాగానికి చెందిన పరిశోధక విద్యార్థి డాక్టర్ జి.కామేశ్వరి కి డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పిహెచ్‌డి) పట్టాను ప్రదానం చేసినట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అసిసోయట్ ప్రొఫెసర్ డాక్టర్ వి.కుమారి పర్యవేక్షణలో కంపారిసన్ ఆఫ్ ది ఎఫికసి ఆఫ్ లో లెవెల్ లేసర్ థెరపి వర్సెస్ అల్ట్రాసౌండ్ థెరపి ఆన్ పెరిక్రేనియన్ మయోఫెషియల్ ట్రిగ్గర్ పాయింట్స్ ఇన్ సబ్జెక్ట్స్ విత్ క్రానిక్ టెన్షన్ హెడ్ఎక్ అనే అంశంపై పరిశోధనను పత్రం సమర్పించడంతో పీహెచ్‌డీ ప్రదానం చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పరిశోధక విద్యార్థిని డాక్టర్ జి.కామేశ్వరి ని స్విమ్స్ సంచాలకులు డాక్టర్ ఆర్‌వికుమార్, డీన్ డాక్టర్ అలోక్ సచన్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్, ఆర్ఎంఓ డాక్టర్ కోటిరెడ్డి, వివిధ విభాగాధిపతులు, సిబ్బంది, విద్యార్థులు, అభినందనలు తెలిపారు.

ఉపాధ్యాయులకు క్రీడల పోటీలు

ప్రజాశక్తి -రామచంద్రాపురం: మండలంలో ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు మండల స్థాయి క్రీడా పోటీలను మండల ఎంఈఓ వల్లూరు మార్కొండయ్య నాయుడు ప్రారంభించారు. బుధవారం మండలంలోని నెత్త కుప్పం గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఎంఈఓ మార్కండేయనాయుడు, జయవేలులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల్లో మానసిక ఉల్లాసం, క్రీడా స్ఫూర్తిని పెంపొందించడానికి క్రీడలను నిర్వహిస్తున్నామన్నారు. మండల స్థాయిలో నిర్వహించే ఉపాధ్యాయుల క్రీడల పోటీలకు పురుషులకు క్రికెట్, మహిళలకు త్రో బాల్ పోటీలు నిర్వహించారు. క్రికెట్ జట్టుకు 17 మంది పురుష ఉపాధ్యాయులు, త్రో బాల్ పోటీలకు 9 మంది మహిళా ఉపాధ్యాయులు ఎంపికైనట్లు ఎంఈఓ మార్కండేయనాయుడు తెలిపారు. మండల స్థాయిలో ఎంపికైన వారు నియోజక వర్గస్థాయి స్థాయిలో జరిగే పోటీల్లో తలపడుతున్నట్లు తెలిపారు.

లాభసాటి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి - క్యాంపస్ : రైతన్న మీకోసం కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ కళాశాల విద్యార్థిని విద్యార్థులు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన 'రైతన్నా మీకోసం' కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్న కార్యక్రమాన్ని ఉద్దేశించి శ్రీ వేంకటేశ్వర వ్యవసాయ కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థిని విద్యార్థులు వివిధ రైతు సేవా కేంద్రాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాలుపంచుకొని అన్నదాతలతో మమేకమై రైతులకు వ్యవసాయం లాభసాటి కావడానికి ప్రభుత్వం చేపట్టిన పంచ సూత్రాల లక్ష్యాలను రైతులకు వివరించారు. క్షేత్రస్థాయిలో రైతాంగ సమస్యలను అర్థం చేసుకోవడానికి తిరుపతి గ్రామీణ మండలం బ్రాహ్మణపట్టు దుర్గ సముద్రం గొల్లవానిపల్లి, చంద్రగిరి మండలం నందు సానంభట్ల చంద్రగిరి డోర్నకంబాల గ్రామాల నందు పాల్గొని లాభసాటి వ్యవసాయానికి పంచ సూత్రాలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎస్ ప్రసాద్ రావు, మండల వ్యవసాయ అధికారి విజయభాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

భవన నిర్మాణాలకు అనుమతి తప్పనిసరి : కమిషనర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: నగర పాలక సంస్థ అనుమతులు లేకుండా భవన నిర్మాణాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ఎన్.మౌర్య హెచ్చరించారు. బుధవారం తిరుపతి నగరంలో తిరుమల బైపాస్‌రోడ్డునందు ఎన్జీవో కాలనీలో నిర్మిస్తున్న అనధికార అదనపు అంతస్తుల నిర్మాణాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో కమిషనర్ ఆదేశాల మేరకు డిసిపి ఖాన్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎసిపిలు మూర్తి, మధు, టిపిఓ వంశీ, టిపిబిఓ శరణ్‌రాజ్ పాల్గొన్నారు. ఆగస్టు 31 తరువాత జరుగుతున్న అన్ని భవన నిర్మాణాలపై శాటిలైట్ నిఘా ఉందన్నారు. అదనపు అంతస్తుల నిర్మాణం చేయాలనుకుంటే నిబంధనల మేరకు టిడిఆర్ బాండ్లను వినియోగించి చేసుకోవచ్చున్నారు. ఆగస్టు 31వ తేదీ లోపు ఏవైనా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరిగి ఉంటే బిల్డింగ్ పీనలైజేషన్ స్కీమ్ (బిపిఎస్) ద్వారా క్రమబద్ధీకరణ చేసుకోవాలని తెలిపారు. ఈ విషయాలపై ప్రజలకు మరింతగా అవగాహన కల్పించాలని తెలిపారు.

పశువుల దాణా పంపిణీ

రేణిగుంట : శ్రీకాళహస్తి నియోజక వర్గ పరిశీలకు నిగా తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి స్థానిక ఎంఎల్ఏ సుధీ ర్‌రెడ్డితో కలిసి బుధవారం సబ్సిడీ పశువుల దాణాను రైతులకు పంపిణీ చేశారు.

CHANGE OF NAME
I,Rasagolla Bharathi (Old Name) W/o Rasagolla Srinivasulu, R/o 14-13A, Shop Street, Puttur, Tirupati District - 517583, A.P. I Changed my Name to **RASAGONDLA BHARATHI.** Henceforth, I Will be Known as **RASAGONDLA BHARATHI (NEW NAME).**

సొంతింటి కల సాకారం శ్రీకృష్ణ హైట్స్‌తో సాధ్యం

శ్రీకృష్ణ హైట్స్ అధినేత వి శ్రీనివాస్

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: విలాస వంతమైన లగ్జరీ సౌకర్యాలతో ప్రతి ఒకరి సొంతింటి కల సాకారం శ్రీకృష్ణ హైట్స్‌తో సాధ్య మని ఆ సంస్థ అధినేత, క్రెడాయ్ మాజీ అధ్యక్షులు వి శ్రీనివాస్ తెలిపారు. తిరుపతి- రేణి గుంట రోడ్డు, మారుతి ట్రూవ్యాలీ షోరూమ్ సమీపంలో పూల వాని గుంటలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీకృష్ణ హైట్స్ వద్ద ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ ఉన్నతమైన జీవన జీవితాన్ని అందించేందుకు తాము ఉన్నత ప్రమాణాల నిర్మాణ సామగ్రిని ఉపయోగిస్తున్నామన్నారు. ఇందులో సాటిలేని స్పెసిఫికేషన్లతో కూడిన సొగసైన, విలాస వంత మైన గృహాలు, అది అందించే నాణ్యత ద్వారా నిర్వహించ బడ్డాయన్నారు. ప్రారంభం నుంచి సొగసైన గెటెడ్ కమ్యూనిటిని నిర్మించడంలో ఆర్కిటెక్చర్, డిజైన్, సామగ్రి పరంగా అత్తుమ ప్రయత్నాలతో ఈ ప్రాజెక్టు ఏర్పాటు చేశామన్నారు. విలక్షణమైన స్టైలింగ్ డిజైన్, స్మార్ట్ ఆర్కిటెక్చర్, తెలివైన డిజైన్ ఫలితం, ట్రిబుల్ బెడ్రూమ్స్, డబుల్ బెడ్ రూమ్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. జీవన స్థలంలోని అత్యుత్తమత ను బయటకు తీసుకొచ్చే తెలివైన డిజైన్లు ఉన్న స్థలాన్ని పిల్లలు ఎటువంటి చింత లేకుండా స్వేచ్ఛగా పరిగెత్తగలిగే వాతావరణ పరిస్థితుల్లో

అత్యాధునిక పద్ధతిలో సరికొత్త సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మాణాలు చేపట్టామన్నారు. వినియోగదారులు దీన్ని సద్వినియోగం చేసు కోవాలని కోరారు. వివ రాలకు 98486 30376 ఫోన్ నెంబరును సంప్ర దించాలన్నారు.

ప్రత్యేకతలు

- పిల్లలు ఆడుకునేందుకు విశాలవంతమైన ఆటస్థలం,
- కాలుష్యం లేని ప్రాంతం.
- ఆహ్లాదం కల్గించే వాతావరణం.
- విశాలమైన గదులు,
- అందరికి మెచ్చే డిజైన్లు.
- పార్కింగ్, పార్కు సౌకర్యం.
- సిసి కెమెరాల నిఘా.
- అద్భుతమైన వెంటిలేషన్.
- రైల్వేస్టేషన్‌కు 6 కిలోమీటర్ల దూరం.
- విమానశ్రయం, బస్టాండుకు అందుబాటులో.
- తిరువానూరు అమ్మవారి ఆలయానికి అత్యంత సమీపం.

నూతన వస్త్రాలు పంపిణీ

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: బిషప్స్ డయాసిస్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యం లో యునైటెడ్ క్రిస్మస్ సంబరాల్లో భాగంగా పాస్టర్లకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆ సంఘం ఛైర్మన్ డాక్టర్ ఎల్లమంచిలి ప్రవీణ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు వారి 'ఈగో 'ని విడిచి పెట్టాలన్నారు. అనంతరం దైవ సేవకులకు నూతన వస్త్రాలు బహూకరించారు. క్రిస్మస్ కేక్ కట్ చేసి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

మహారాజ శ్రీ గూడూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. No: 278 OF 2024
Andhra Pragathi Grameena Bank,
Thikkavaram Branch, Rep.by its Magager ....Plaintiff
Vs.
1. Tirumalasetty Sujanamma and another ...Defendants
To D1.Tirumalasetty Sujanamma,
W/o Srinivasulu, Thikkavaram Village,
Chillakur Mandal, Tirupati District.
పై నెంబరులోని వాది తన లోను బాకీ రాబట్టు కొనుటకు గాను దావా దాఖలు చేసినందున 1వ ప్రతివాది నోటీసుకు గాను తేది. 18-12-2025న వాయిదా వేసియున్నారు. కావున పై దావా విషయమై 1వ ప్రతివాదికి ఎలాంటి ఆక్షేపణలు ఉన్నయెడల పై కోర్టు ఎదుట పై తేదిన ఉదయం 10.30 గం॥లకు హాజరై తెలుపుకోవలసినది. లేని యెడల సదరు విషయమై నీ పరోక్షమున విచారించి తీర్మానం చేయుదురని తెలియచేయడమైనది.
ఇట్లు
టి. రఘురామిరెడ్డి,
వాది తరపున న్యాయవాది, గూడూరు.

IN THE COURT OF THE III ADDL. DISTRICT JUDGE :: TIRUPATI
A.S.NO.82/2018
C.Sudhakar Reddy... Appellant
Vs.
M.Srinivasan & Others
...Respodents
NOTICE TO THE RESPONDENT NO.10
R10: K.S.Swathi, W/o. Late K.S.Raghu, D.No.235, G.N.Mada Street, Tirupati
పై కనిన అప్పీల్ దావాలో 10వ రెస్పాండెంట్‌కు నోటీసు నిమిత్తం తేది: 05.01.2026న ఉదయం 10.30గం॥ల కు పై కనిన 10వ రెస్పాండెంట్ హాజరై సమాధానము చెప్పుకోవలసినదిగా కోర్టు వారు వాయిదా వేసి యున్నారు. రాని యెడల పరోక్షముగా తీర్మానించ బడును.
వాయిదా : 05.01.2026
పి.ప్రభాకర నాయుడు, అడ్వకేట్, తిరుపతి

IN THE COURT OF THE ADDITIONAL JUNIOR CIVIL JUDGE, SRIKALAHASTI
I.A NO. 709/2025
O.S.No. 271/2025
Between
M. Muni Mohan Reddy S/o M. Muni Raja, Velavedu Village, Srikalahasti Mandal, Tirupati District, A.P. **...Petitioner.**
And
C. Rajeswaramma & 3 others **...Respondents.**
Notice to Respondents No 3 and 4.
Respondent No: 3
C. Kodandarami Reddy S/o. Late Raghava Reddy velavedu village, Srikalahast Mandal, Tirupat District, AP.
Respondent No. 4.
C.Murali Reddy S/o, Late Raghava Reddy, velavedu village, Srikalahasti Mandal, Tirupati District, AP.
Please take the Notice in the above Petition for Injunction against you both as prayed for by the Petitioner in the above suit. The above Petition is posted to 16.12.2025 for your appearance. If you both fail to attend, the matter will be decided exparte
Dt 01.12.2025
F. SRINIVASAN, B.A,BL
T. GOKULA KRISHNA, MBA, LLB
PVS LAKSHMI, B.A,B.L
R. JAYAVANI, M.Com, LLM
Advocate for Petitioner

మహారాజ శ్రీ గూడూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. No: 303 OF 2024
Andhra Pragathi Grameena Bank,
Thikkavaram Branch, Rep.by its Magager ....Plaintiff
Vs.
1. Konda Uday Kumar Reddy and 3 others ...Defendants
To, D2. Konda Mohit, S/o Uday Kuamr Reddy,
D3. Konda Hanit, S/o Uday Kuamar Reddy,
Both are residents of Opp. to DSP Office, Sivalayam Street, Gudur town, Tirupati District.
పై నెంబరులోని వాది తన లోను బాకీ రాబట్టు కొనుటకు గాను దావా దాఖలు చేసినందున 2వ మరియు 3వ ప్రతివాదుల నోటీసుకు గాను తేది. 24-12-2025న వాయిదా వేసియున్నారు. కావున పై దావా విషయమై 2వ మరియు 3వ ప్రతివాదులకు ఎలాంటి ఆక్షేపణలు ఉన్నయెడల పై కోర్టు ఎదుట పై తేదిన ఉదయం 10.30 గం॥లకు హాజరై తెలుపుకోవలసినది. లేని యెడల సదరు విషయమై నీ పరోక్షమున విచారించి తీర్మానం చేయుదురని తెలియచేయడమైనది.
ఇట్లు
టి. రఘురామిరెడ్డి,
వాది తరపున న్యాయవాది, గూడూరు.

జలదిగ్బంధంలో విద్యుత్ సబ్ స్టేషన్

ప్రజాశక్తి -కోట : దిత్వా తుపాన్ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం నుండి రాత్రి పది గంటల వరకు అకాల వర్షంతో ఎక్కడపడితే అక్కడ రోడ్లు, నివాస గృహాలు, విద్యానగర్ ప్రభుత్వ పశువుల ఆసుపత్రి, విద్యుత్ సబ్‌స్టేషన్, తదితరాలు ఒక్కసారిగా జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. దీంతో ప్రజలు పలు రకాల ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విద్యానగర్ సబ్‌స్టేషన్ ఆవరణలో వర్షపు నీరు వెళ్లడానికి మార్గం లేకపోవడంతో సబ్‌స్టేషన్ ఆవరణ జలదిగ్బంధమైంది. విద్యానగర్‌లో పశువుల ఆస్పత్రి వర్షపు నీటిలో మునిగింది. పలు నివాస గృహాల్లోకి వర్షపు నీరు చేరుకోవడంతో ఆ నీటిని ప్రత్యేకంగా మోటారు సాయంతో బయటకు తొలగిస్తున్నారు. గృహ సామగ్రి మొత్తం తడిసి పోయాయి. కొన్ని ప్రాంతాల్లో రోడ్లపై వర్షపు నీరు నిల్వ ఉండడంతో ప్రయాణికుల రాకపోకలు స్తంభించాయి. దీంతో బుధవారం మధ్యాహ్నం పలువురు టీడీపీ నాయకులు చొరవతో విద్యానగర్‌లో జేసీబీ సాయంతో రోడ్డు పక్కనే కాలువను తీసి నీటిని తొలగించారు. మంగళవారం సాయంత్రం నాలుగు గంటల నుండి రాత్రి పది గంటల వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మంగళవారం రాత్రి నుండి బుధవారం మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఆగిపోయింది. విద్యానగర్ సబ్ డివిజనల్ కార్యాలయం జలదిగ్బంధంలో చిక్కిన విషయం తెలుసుకున్న తిరుపతి విద్యుత్ శాఖ జిల్లా ఎస్ఈ చంద్రశేఖర రావు ప్రత్యేకంగా సంఘటన స్థలానికి చేరుకుని సబ్ స్టేషన్ స్థితిగతులను క్షుణ్ణంగా స్థానిక విద్యుత్ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు వర్షపు నీరు నిల్వ లేకుండా బయటకు వెళ్లడానికి తగు ఏర్పాట్లను చేస్తామని

విద్యుత్ అధికారులు అప్రమత్తం

జలదిగ్బంధంలో చిక్కుకున్న విద్యుత్ సబ్ స్టేషన్

తిరుపతి జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ చంద్రశేఖర రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ చంద్రశేఖరరావు గూడూరు, ఈఈ నరేందర్ రెడ్డి, నాయుడుపేట ఈఈ శ్రీనివాసులు, నాయుడుపేట డిఈ వరప్రసాద్ రెడ్డి, గూడూరు డిఈ ప్రసాద్, కోట ఏఈ అనంతరావు, చెందోడు ఏఈ శశికళ, కోట, వాకాడు, చిట్టమూరు మండలాల విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వర్షపు నీటికి మునిగిన రైస్‌మిల్లు బియ్యం బస్తాలు

నీట మునిగిన లక్షల విలువైన బియ్యం

హరిహర రైస్ మిల్లు యాజమాన్యం లబోదిబో

ప్రజాశక్తి -కోట : కోట మండలం క్రాస్ రోడ్డులోని శ్రీ హరిహర రైస్ మిల్లు దిత్వా తుపాను నేపథ్యంలో వచ్చిన వర్షాలతో హరిహర రైస్ మిల్లు నీట మునిగింది. కోట, వాకాడు, చిట్టమూరు మండలాల రైతుల కష్టం నీటి పాలైంది. ఈ సందర్భంగా లక్షల రూపాయలు విలువ చేసే బియ్యం పూర్తిగా తడిసిపోయాయి. రైతులు తనను నమ్మి ధాన్యం మిల్లుకు తరలించారని విడతల వారీగా రైతులకు నగదు చెల్లిస్తామని ప్రస్తుతం ఈ నీటి పాలైన బియ్యాన్ని ఎవరు కొంటారని, రైతులకు ఏం సమాధానం చెప్పాలని యజమాని గంధం శ్రీనివాసులు ఆందోళన వ్యక్తం చేశారు. మండల పరిధిలోని రైతులు వేసిన ధాన్యాన్ని గిట్టుబాటు ధర లేని కారణంగా మిల్లులకు తరలించి గిట్టుబాటు ధర వచ్చినప్పుడు వాటిని అమ్ముకునే పరిస్థితి వుంది. ఈ నేపథ్యంలో అకస్మాత్తుగా దిత్వా తుపాను కారణంగా మిల్లుకు తాళం వేసి యాజమాన్యం ఇంటికి వెళ్లారు. అయితే ఒక్కసారిగా అర్ధరాత్రి కుండపోత వర్షంతో వర్షపు నీరు భారీగా మిల్లులో చేరి బియ్యం తడిసి పోయాయి. ఉదయం వచ్చి చూసిన యజమాని అవాక్కయ్యారు. రైతులకు నేను ఏమి సమాధానం చెప్పాలని దిక్కుతోచని స్థితిలో లబోదిబోమన్నారు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని గంధం శ్రీనివాసులు కోరుతున్నారు.

పెంచలయ్య కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి: కేవీపీఎస్

ప్రజాశక్తి-సత్యవేడు: గంజాయి, మత్తుమందులను అడ్డుకుని నెల్లూరులో ప్రజలకు అండగా నిలిచి హత్యకు గురైన పెంచలయ్య కుటుంబానికి ప్రభుత్వం 50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి ఆదుకోవాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు దేశాండి అరుణాచలం బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. హత్యకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. సమాజ హితం కోసం పోరాడి మరణించిన పెంచలయ్య కుటుంబానికి 50 లక్షల ఎక్స్‌గ్రేషియా, ఆరు ఎకరాల భూమి, ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించి ఆదుకోవాలని

కోరారు. ఈ దారుణానికి పాల్పడ్డ గంజాయి మాఫియా ముఠా ఎట్టివారైనా కఠినంగా శిక్షించాలన్నారు. గంజాయి మత్తు పదార్థాలను సత్యవేడు ప్రాంతంలోనూ విరివిగా విక్రయిస్తున్నారని. తద్వారా యువత చెడు దారులను ఎంచుకొని వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న ముఠాపై సమగ్ర విచారణ చేపట్టి కఠినంగా శిక్షించాలని పోలీసు వారికి విజ్ఞప్తి చేశారు.

చినుకు పడితే చిత్తడే!

- స్పందించని అధికారులు
- ఇదీ చంద్రగిరి రెవెన్యూ కార్యాలయ ప్రాంగణం దుస్థితి

ప్రజాశక్తి -చంద్రగిరి: చంద్రగిరి పట్టణం లో ఒకే ప్రాంగణంలో రెవెన్యూ, ఉప ఖజానా, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. ఇక్కడ సెలవు రోజులు మినహా నిత్యం ప్రజలతో ఆయా కార్యాలయాలు కిటకిటలాడుతాయి. వర్షాలు వచ్చిన సమయంలో ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాలు బురదతో రొచ్చుగా మారుతున్నాయి. ఇక్కడ చినుకు పడితే చిత్తడి గా మారిందని ఫిర్యాదు దారులు అవస్థలు పడుతున్నారు. ఇక్కడ ఎమ్మార్వో కార్యాలయమా? లేదా పార్కింగ్ కు నిలయమా అన్నట్లు వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. వర్షంలో ఉండటానికి వీలు లేకుండా వాహనాలు పార్క్ చేయడం తో ఫిర్యాదుదారులు ఇబ్బంది పడుతున్నారు..ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుదారులు కోరుతున్నారు.

చినుకు పడితే చిత్తడిగా మారుతున్న చంద్రగిరి రెవెన్యూ కార్యాలయ ప్రాంగణం

భూ ఆక్రమణ కాదు..

- పట్టాపాస్ బుక్ వుంది..
- రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ అధినేత డాక్టర్ రమేష్ నాథ్ లింగట

ప్రజాశక్తి -చంద్రగిరి: చంద్రగిరిలో తాను పట్టాదారు రెవెన్యూ అధికారుల నుంచి పట్టాదారు పాస్ బుక్ పొంది కోర్టు పర్మినెంట్ ఇంజక్షన్ ఆర్డర్ ను తీసుకోవడం వల్ల తన ఆధీనంలో ఉందని రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ అధినేత డాక్టర్ రమేష్ నాథ్ లింగట మీడియాకు ఒక ప్రకటనలో తెలిపారు. తాను ప్రభుత్వ భూమిని ఆక్రమించినట్లు వస్తున్న వార్తలు అవాస్తమని తెలిపారు. తాను జిల్లా కలెక్టరుకు, చంద్రగిరి మండల రెవెన్యూ అధికారికి అన్ని ఆర్డర్లను అందించానని ఆయన మీడియాకు చెప్పారు. తాను ప్రజా సేవ చేయడం అలవాటని పేర్కొన్నారు. తాను ఎంతోమందికి సేవ చేస్తున్నానని వివరించారు. కోర్టు పర్మినెంట్ ఇంజక్షన్ ఆర్డర్ ఉండడంతో భూమి నా ఆధీనంలో ఉందని ఆయన తెలిపారు.

శాస్త్రోక్తంగా చుక్కాని ఉత్సవం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని స్థానిక శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం చుక్కాని ఉత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా పెద్ద నంది విగ్రహం వద్ద సంకల్ప పూజలు నిర్వహించారు. కార్తీక మాసంలో పౌర్ణమి రోజున రాత్రి చుక్కాని ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. అనంతరం తాటిచెట్టును నిలబెట్టి పూజలు చేశారు. అమ్మవారి ఆలయం నుంచి బాల దీపాలను ఊరేగింపుగా తీసుకువచ్చి చుక్కాని వెలిగించారు. ఈ విశేషవేడుకను వీక్షించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివ చ్చారు. కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డు చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్, ఈవో బాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు తిరుమలలో కార్తీక దీపోత్సవం

కార్తీక పౌర్ణమి గరుడ సేవ రద్దు

ప్రజాశక్తి - తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో డిసెంబర్ 4వ తేదీన సాలకట్ల కార్తీక పర్వదీపోత్సవాన్ని టీటీడీ ఘనంగా నిర్వహించనుంది. కార్తీక పౌర్ణమినాడు శ్రీవారికి సాయంకాల కైంకర్యాలు, నివేదనలు పూర్తి అయిన తరువాత ఈ దీపోత్సవం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ప్రతి నెలా నిర్వహించే పౌర్ణమి గరుడ సేవను, సహస్ర దీపాలంకరణ సేవలను టీటీడీ రద్దు చేసింది. ఈ సందర్భంగా సాయంత్రం 5 గంటల నుండి 8.30 గంటల వరకు నేతి వత్తులతో దీపాలను వెలిగించి ఛత్రచామర, మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా విమాన ప్రదక్షిణం చేస్తూ ఆనంద నిలయంలో శ్రీవారికి హారతి ఇస్తారు. ఆ తర్వాత వరుసగా గర్భాలయంలో అఖండం, కులశేఖర పడి, రాములవారి మేడ, ద్వార పాలకులు, గరుడాళ్వారు, వరదరాజస్వామి సన్నిధి, వకుళమాత, బంగారుబావి, కల్యాణ మండపం, సభ అర, తాళ్లపాక అర, భాష్యకారుల సన్నిధి, యోగ నరసింహస్వామి, విష్వక్సేనులు, చందనం అర, పరిమళం అర, వెండి వాకిలి, ధ్వజస్తంభం, బలి పీఠం, క్షేత్ర పాలకుల సన్నిధి, తిరుమలరాయ మండపం, పూలబావి, రంగనాయక మండపం, మహాద్వారం, బేడి ఆంజనేయస్వామి, శ్రీవరాహస్వామి ఆలయం, స్వామి పుష్కరిణి వద్ద దీపాలను ఏర్పాటు చేస్తారు.

నేదురుమల్లిని కలిసిన నల్లపరెడ్డి

ప్రజాశక్తి -కోట : నెల్లూరు జిల్లా వైసీపీ సీనియర్ నాయకులు వెంకటగిరి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్ నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి ని నెల్లూరు లోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి మాజీ మంత్రి, వైసీపీ రాష్ట్ర పిఏసీ సభ్యులు నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డిలు కలిసి గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలిపే ప్రక్రియపై చర్చించారు. ఈ సమావేశంలో చిల్లకూరు మండల కన్వీనర్ మధురెడ్డి, మల్లు విజయ్ కుమార్ రెడ్డి, చిట్టమూరు రాజారెడ్డి, పలగాటి సంపత్ కుమార్ రెడ్డి,వీరి చలపతిరావు, కొండూరు అనిల్ బాబు, నల్లపరెడ్డి రాజేంద్ర కుమార్ రెడ్డి,కలువ బాల శంకర్ రెడ్డి పాల్గొన్నారు.

దూరవిద్యా పీజీ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో పరిధిలో దూరవిద్య ద్వారా ఎంఏ పొలిటికల్ సైన్స్, ఎంఏ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగాల ఫలితాలను విశ్వవిద్యాలయం అధికారులు బుధవారం చేశారు. పిజి రెగ్యులర్ మూడవ సెమిస్టర్ విద్యార్థులకు ఫీజు చెల్లింపు తేదీలను ప్రకటించారు. డిసెంబర్ 4 తేదీ నుంచి 12 వ తేదీ లోపు ఫీజు చెల్లించి ఆన్‌లైన్ ద్వారాదరఖాస్తు చేసుకోవాలని డీన్, ఆచార్య సురేంద్రబాబు, పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాజమాణిక్యం తెలిపారు.

ఘనంగా వికలాంగుల దినోత్సవం

క్యాంపస్ : జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం 2025 ను బుధవారం ఘనంగా నిర్వహించారు. జాతీయ సంస్కృత విద్యాలయంలో విసి ప్రొ జీఎస్ఆర్. కృష్ణమూర్తి అధ్యక్షతన నిర్వహించిన వరల్డ్ డిసబిలిటీ డే 2025 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తిరుచానూరు అంధుల పునరావాస కేంద్రం వ్యవస్థాపక అధ్యక్షులు కే శ్రీధరాచార్య హాజరుకాగా, గౌరవ అతిథిగా విశ్వవిద్యాలయ అకాడమిక్ డీన్ ప్రొఫెసర్ రజనీకాంత్ శుక్ల, ప్రత్యేక అతిథిగా రిజిస్ట్రార్ కె.వెంకటనారాయణరావు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో విసి ఆచార్య జిఎస్ఆర్ కృష్ణమూర్తి, ముఖ్యఅతిథి కె. శ్రీధరాచార్య, కార్యక్రమంలో సమన్వయకర్త డాక్టరు సి.హెచ్. నాగరాజు, సహ సమన్వయకర్తగా డాక్టరు కనపాల కుమార్, దివ్యాంగ ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయంలోని మహిళా అధ్యయన కేంద్రం డాక్టర్ కే రాణి అసిస్టెంట్ ప్రొఫెసర్ అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవ సందర్భంగా అవాహన కల్పించారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం లోని లా నర్సింగ్ విద్యార్థులకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యయన శాఖ సిబ్బంది వి ప్రీతి, విద్యార్థులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో రేవంత్ కుమార్ మృతి

ప్రజాశక్తి- సత్యవేడు: సత్యవేడు పట్టణంలోని టిడిపి నాయకుడు పలని కుమారుడు రేవంత్ కుమార్(24) బుధవారం మృతి చెందారు. అనారోగ్య బారిన పడ్డ రేవంత్ కుమార్ గత కొద్ది కాలంగా చెన్నై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ నేపథ్యంలో బుధవారం మృతి చెందారు. రేవంత్ కుమార్ తండ్రి పలని పట్టణంలోని శ్రీకాళహస్తి మార్గంలో కూల్ డ్రింక్స్, టీ కొట్టు దుకాణం నడుపుతూ జీవనాన్ని కొనసాగిస్తున్నారు. రేవంత్ కుమార్ మృతి కుటుంబంలో విషాదాన్ని నింపింది. టిడిపి నాయకులు పలని కుమారుడు మృతి పట్ల సత్యవేడు నియోజకవర్గ టిడిపి ప్రోగ్రాం కోఆర్డినేటర్ శంకర్ రెడ్డి,పలువురు నాయకులు కార్యకర్తలు తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. మృతి చెందిన రేవంత్ కుమార్ దహన సంస్కారాలు డిసెంబర్ గురువారం నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

ఎస్‌టియు మండల అధ్యక్షుడిగా శ్రీనివాసులు

ప్రజాశక్తి -రామచంద్రపురం : ఎస్‌టియు రామ చంద్రాపురం మండల అధ్యక్షుడిగా శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా ఎస్ హరినాథ్ రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రామచంద్రపురం మండలం, రామాపురంలో బుధవారం ఎస్‌టియు నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికలు ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఉపాధ్యాయ వాణి సంపాదకులు శ్రీగాజుల నాగేశ్వర రావు, జిల్లా ప్రధాన కార్య దర్శి జగన్నాధంల ఆధ్వర్యంలో విచ్చేశారు. గౌరవ అధ్యక్షులుగా కె. పురుషోత్తమ రెడ్డి. ఆర్థిక కార్యదర్శిగా హరిబాబు, సహాధ్యక్షులుగా నారాయణరెడ్డి, ఉపాధ్యక్షులుగా నాగేశ్వర్, జిల్లా కౌన్సిలర్లుగా గాజుల నాగేశ్వరరావు, ఎం రామాంజనేయులు, సి వాసులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ అధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నూతన కమిటీ కృషి చేస్తుందని తెలిపారు. నూతన కమిటీ సభ్యులకు ఉపాధ్యాయులు శాలువలతో సత్కరించి అభినందనలు తెలిపారు.